మౌలిక వసతుల కల్పనకు కృషి


డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: దశలవారీగా డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు 24వ డివిజన్ కార్పొరేటర్ గుర్రాల రమావెంకటేశ్‌యాదవ్ అన్నారు. ఈస్ట్ జ్యోతినగర్‌లో సోమవారం రూ.10 లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో నాటిన మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం తమ లక్ష్యమన్నారు. కాలనీ అధ్యక్షులు గుర్రాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి నాగేందర్, నాయకులు తోట నర్సింహ్మ, అనిల్‌కుమార్, భాస్కర్, నర్సింగ్‌రావు, వేణు, కృష్ణ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలని వినతి


జోనల్ కమిషనర్‌కి వినతిపత్రం అందజేస్తున్న రాజ్యలక్ష్మి

మౌలాలి : సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను వినాయక్‌నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి కలిశారు. ఈ మేరకు మంగళవారం జోనల్ కమిషనర్‌తో ప్రజాసమస్యలపై వివరించామన్నారు. పెండింగ్‌లో ఉన్న కాకతీయనగర్ ప్రధాన బస్‌రూట్ రోడ్డు, శివానగర్‌లో మిగిలిన బాక్సు డ్రైనేజీ వెంటనే రోడ్లు, మరికొన్ని రోడ్లకు బడ్జెట్ రిలీజ్ చేయాలని కోరామని, జెడ్‌సీ సానుకూలంగా స్పందించారన్నారు. వినాయక్‌నగర్‌కు చెందిన ఈస్ట్ ఆనంద్‌బాగ్ కమ్యూనిటీహాల్‌ను మల్టీలెవల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా తీర్చిదిద్దాలని, ఎస్‌ఎన్‌డీపీ ఫేస్–2లో వినాయక్‌నగర్‌లోని నాలాలను అభివృద్ధి చేయాలని వినతిపత్రం అందజేశామన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ కమిటీ సభ్యులు

కాప్రా: వంపుగూడలో అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని కాప్రా తహసీల్దార్‌ను కోరారు. వంపుగూడ గ్రామ కమిటీ సభ్యులు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వేనంబర్ 104లో కొందరు వ్యక్తులు సమీప సర్వే నంబర్ పేరుతో లేఔట్లు చేసి నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదు చేశారు. తక్షణమే సదరు స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వమే సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీవాసులు పడమటి మల్లారెడ్డి, పీసరి భూపాల్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో తిరంగా ర్యాలీ..


తిరంగా ర్యాలీలో బీజేవైఎం నేతలు

ఉప్పల్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బీజేవైఎం మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రేవల్లి రాజు ఆధ్వర్యంలో ఉప్పల్‌లో తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఉప్పల్ వీటీ కమాన్ నుంచి రింగ్ రోడ్డు వరకు ర్యాలీ చేపట్టారు. దారి పొడవునా ఘర్ ఘర్ తిరంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని సూచించారు. రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, దేవేందర్‌రెడ్డి, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని వీరారెడ్డినగర్‌కాలనీలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పర్యటించారు. చిన్నపాటి వర్షానికి సైతం వీరారెడ్డినగర్ కాలనీలో మోకాళ్ల లోతు నీరు నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి విజ్ఞప్తి మేరకు కాలనీల్లో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, స్థానిక బీఆర్‌ఎస్ నేతలు దాసరి కర్ణ, నర్సింగ్‌రావు, రెబల్ రాజు, చిన్న, రవి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు చేయండి



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి మంగళవారం రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్‌ను రియాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని, పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ ఈనెల 21న పీర్జాదిగూడ ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తారని సమాచారం. పీర్జాదిగూడ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రామయ్య, కాంగ్రెస్ నేతలు రమేష్, మహ్మద్ మజార్, నాగేష్, అరుణ్ పాల్గొన్నారు.

సమస్యలపై నిర్లక్ష్యమేల..?

- ప్రజావాణిలో స్థానికుల ఫిర్యాదు
- పట్టించుకోవడం లేదని ప్రజల ఆవేదన


ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

రామంతాపూర్: సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీరు సరఫరా చేసే వాల్వుల నుంచి పెద్దఎత్తున తాగునీరు లీకేజీ ఏర్పడి రోడ్లపై పారుతున్నాయి. రామంతాపూర్ చిన్న చెరువును అనుకొని ఉన్న టాయిలెట్స్ శిథిలమై దుర్వాసన వెదజల్లుతున్నాయి. రామంతాపూర్ ప్రధాన రహదారిలో రోడ్డు మధ్యలో ఉండే బారికేడ్లు తీసేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన రహదారిలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో బస్టాండ్‌లోనే వెహికిల్ చార్జింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు అనేక ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు. ఈ సమస్యలను కాలనీ సంఘాలు ఆయా కాలనీ వాసులు ఫోన్ చేసి సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేసేందుకు సంబంధిత అధికారుల ఫోన్ నెంబర్ వివరాలను అందిస్తుంది.

శిథిలావస్థలో టాయిలెట్స్..

రామంతాపూర్ చిన్న చెరువు రజక సంఘం వద్ద జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టాయిలెట్స్‌కు సరైన నిర్వహణ లేకపోవడంతో అవి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో ప్రధాన రహదారికి ఈ రోడ్డు కూడా వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరుపయోగంగా ఉన్న వీటిని తొలగింపజేయాలని ప్రజలు కోరుతున్నారు. జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగం అధికారి రాజేశ్వర్‌రెడ్డి, ఫోన్ నెం. 9441285252.

భారీకేడ్స్ తొలగించడంతో ప్రమాదాలు..

రామంతాపూర్ ప్రధాన రహదారిలో ఉన్న ల్యాండ్ మార్క్ హోటల్ వైన్‌మార్క్ మద్యం షాపు ఎదురుగా ఉన్న రోడ్డుపై డివైడర్ మీద బారికేడ్స్ ఏర్పాటు చేశారు. గత నెల క్రితం నుంచి ఈ రోడ్డుపై ఉన్న భారీకేడ్స్‌ను తొలగించారు. దీంతో రాంగ్‌రూట్‌లో వచ్చే వాహనాలు ఈ వాహనాలకు తాకి పలు సార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్యపై ఫిర్యాదు చేసేందుకు ట్రాఫిక్ అధికారి ఫోన్ నెం. 8712662421.

ప్రజలకు ఇబ్బంది..

ఫుట్‌పాత్‌పై ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం వల్ల బస్సుల కోసం వేచి చూసే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, ఛార్జింగ్ కోసం వచ్చే వాహనాలు నిలిపేందుకు స్థలం లేక పోవడంతో ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. ఛార్జింగ్ కేంద్రాన్ని సమీపంలో ఉన్న జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ వేరొక స్థలంలో ఏర్పాటు చేస్తే అందరికి అనువుగా ఉంటుందని, జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


నెహ్రూనగర్‌లో తాగునీరు లీకేజీ..


రామంతాపూర్ ప్రధాన రహదారిలో ఛార్జింగ్ స్టేషన్

బస్టాండ్‌లో ఛార్జింగ్ స్టేషన్‌తో...

ప్రధాన రహదారిలోని భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రహరీకి ఆనుకుని ఫుట్‌పాత్ వద్ద ఉప్పల్, ఘట్‌కేసర్, యాదగిరిగుట్ట, వరంగల్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్టాండ్ ఉంది. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ఇంధన పునరుత్పత్తి అభివృద్ధి సంస్థ జీహెచ్‌ఎంసీ సంయుక్తాధ్వర్యంలో ఎలక్ట్రికల్ వెహికిల్ ఛార్జింగ్ స్టేషన్ యంత్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఛార్జింగ్ స్టేషన్ సెంటర్‌లో త్వరలో ప్రారంభించనున్నట్లు సమాచారం.

తాగునీటి లీకేజీలకు మరమ్మతులు నిల్..

ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ప్రతిరోజు ఏదో ఒకచోట లీకేజీలతో తాగునీరు వృథాగా రోడ్లపై పారుతున్న జలమండలి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. గత రెండు నెలలుగా రామంతాపూర్ నెహ్రూనగర్ మార్కెట్ వీధి బద్ది పోచమ్మ దేవాలయం చౌరస్తా వద్ద తాగునీటిని సరఫరా చేసే వాల్వు నుంచి రోజూ నీరు లీకేజై రోడ్లపై ప్రవహిస్తుండటంతో ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు, పాదచారులు జారీ పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి వాల్వుకు మరమ్మతులు చేపట్టి తాగునీటి లీకేజీని అరికట్టాలని స్థానిక సంక్షేమ సంఘం నేతలు కోరుతున్నారు. ఈ సమస్యపై జలమండలి ఏఈ రవీందర్‌గౌడ్ ఫోన్ నెం. 915466578.


నిరుపయోగంగా టాయిలెట్స్..

ప్రభుత్వ స్థలాలు కాపాడాలని వినతి

బోడుప్పల్: మేడిపల్లి మండల పరిధిలో ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరుతూ.. సీపీఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని సర్వేనంబరు 63/26 నుంచి 33 వరకు, సర్వేనంబరు 3లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురై అనుమతి లేకుండా షెడ్డులు, ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. వీటిపై స్థానిక తహసీల్దార్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడి, అక్రమ నిర్మాణాలను నిర్మించకుండా చూడాలని కిషన్ కోరారు.

చిన్నారులకు పండుగలను పరిచయం చేయాలి

ఉప్పల్: ఉప్పల్ విజయపురికాలనీలోని బబుల్స్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వరలక్ష్మి వ్రతం కార్యక్రమానికి ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచి విద్యార్థులకు మన సంస్కృతి సాంప్రదాయాలను తెలిపేలా పండుగలను పరిచయం చేయాలని సూచించారు. అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న స్కూల్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్ చందన, కరస్పాండెంట్ శ్రీనివాస్‌గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై జీహెచ్‌ఎంసీ చర్యలు

అల్వాల్: నిబంధనలకు విరుద్ధంగా చిన్న రాయుని చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన కట్టడాలపై జీహెచ్‌ఎంసీ అధికారులు కొరడా ఝుళిపించారు. మంగళవారం చిన్నా రాయుని చెరువు సమీపంలో అక్రమ కట్టడాలకు నోటీసులు జారీ చేయడంతో పాటు ఓ నిర్మాణాన్ని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతిరోజు అక్రమ కట్టడాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు


కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ అంజయ్య

కుషాయిగూడ: శుభకార్యాలు, గృహప్రవేశాలు జరిగేచోట బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ అంజయ్య హిజ్రాలను హెచ్చరించారు. మంగళవారం హిజ్రాల గురువులు, సీసీఎస్ ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హిజ్రాల గురువులకు ఇన్‌స్పెక్టర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. నిర్వాహకులు ఇష్టంగా ఇచ్చింది తీసుకోవాలని, ఇబ్బందులకు గురిచేయడం, బూతులు తిడుతూ.. శాపనార్థలు ఇవ్వడం, అసభ్యకరంగా వ్యవహరించడం వంటి చర్యలకు పాల్పడొద్దని సూచించారు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో తిరిగి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠినంగా వ్యవహరిస్తామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. అనంతరం సీసీఎస్ ప్రతినిధులు హిజ్రాల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని వినతిపత్రం అందజేశారు. సీసీఎస్ ప్రతినిధులు ఎంపల్లి పద్మారెడ్డి, రహీం, కొండూరి మురళీపంతులు, పురుషోత్తంరెడ్డి, షాబాద్, దామోదర్‌రెడ్డి, డాక్టర్ కుమారస్వామి, దుర్గారెడ్డి, నవీన, రాజు, విజయ, సుజాత, శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి


జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితో మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కోరారు. కాప్రా సర్కిల్ పరిధిలోని తాగునీటి సమస్య పరిష్కారానికి రిజర్వాయర్లను నిర్మించాలని కోరారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్‌లో నుంచి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యకు సరైన పరిష్కారం చూపాలన్నారు. ఉప్పల్ నల్ల చెరువు వరకు వచ్చే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ట్రంక్ లైన్ అవుట్‌లెట్ కలపకపోవడంతో అనేక సమస్యలు ఎదురౌతున్నట్లు ఎండీకి వివరించామన్నారు. వివిధ కాలనీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై..

కాప్రా: గ్రేటర్ హైదరాబాద్ కాప్రా సర్కిల్‌లోని పలు కాలనీవాసులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని మందముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. నీటి సమస్యను పరిష్కరించేందుకు రిజర్వాయర్‌ను నిర్మించాలని వాటర్ వర్క్స్ ఎండీ అశోక్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు. శ్రీయుగ కాలనీ, పద్మశాలి టౌన్‌షిప్ వాసులు బుజ్జిబాబు, జీఎంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్

మల్కాజిగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మల్కాజిగిరి డివిజన్ ఆర్‌డీఓ శ్యామ్ ప్రకాష్ సూచించారు. మంగళవారం మల్కాజిగిరి మండల పరిధిలోని నేరెడ్‌మెట్, వాజ్‌పేయ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడి బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. గతంలో కంటే భిన్న ఫలితాలు మెరుగ్గా రావడానికి ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేయాలని విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పాఠాలు బోధించాలని సూచించారు.

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌లోని మల్లాపూర్ బీసీబాయ్స్ హాస్టల్‌లో మంగళవారం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే హాస్టల్‌ను తనిఖీ చేసినట్లు ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. హాస్టల్‌లో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదన్నారు. 150 మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డులో ఉండగా.. కేవలం 70 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు అందించే భోజనం పూర్తి నాసిరకంగా ఉందన్నారు. తమ దృష్టికి వచ్చిన అంశాలను సంబంధిత ఉన్నతాధికారులకు చెప్పామన్నారు. తూనికల అధికారులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో

కిడ్నీ బాధితులకు విరాళం

బోడుప్పల్: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ బోడుప్పల్ గ్రీన్ చార్టర్ ప్రెసిడెంట్ లయన్ టి. అబ్రహం లింకన్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ముగ్గురు కిడ్నీ డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు విరాళం అందజేసి డయాలసిస్ చేయించారు. చర్లపల్లిలోని లయన్స్ కిడ్నీ డయాలసిస్ సెంటర్‌లో ముగ్గురికి ఒకరోజు డయాలసిస్ చేయడానికి రూ. 4500 సాయం చేశారు. క్లబ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, లక్ష్మణ్‌చారి పాల్గొన్నారు.

ఆక్రమణలను ఉపేక్షించేది లేదు: డీసీ

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని, కోర్టు కేసులను సత్వరమే పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ, సూపర్‌వైజర్ సురేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

హిందూ ఐక్యతా ర్యాలీ

మల్కాజిగిరి: బంగ్లాదేశ్‌లో హిందువులపై అరాచకాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మల్కాజిగిరి ఆనంద్‌బాగ్ నుంచి మల్కాజిగిరి చౌరస్తా వరకు జాతీయ జెండాలతో హిందూ ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ, విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ నాయకులతో పాటు హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి డా. శశిధర్ మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో జరిగిన ఘటన దురదృష్టకరమని, బంగ్లాదేశ్‌లో జరిగిన ఘటనలపై ప్రతి ఒక్కరూ స్పందించి ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం

కుషాయిగూడ : ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన మంగళవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి, అంబేడ్కర్‌నగర్‌కు చెందిన జగదీశ్వరచారి కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఉదయం పనికి వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్థిక ఇబ్బందులే కారణమని సమాచారం. భార్య జ్యోతి ఫిర్యాదుతో ఇన్‌స్పెక్టర్ రవీందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మరో ఘటనలో..

అల్వాల్: మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్‌లో నివసించే సుబేదార్ సంజయ్‌కుమార్‌సింగ్ కుమారుడు హృతిక్‌సింగ్ (23) మానసిక స్థితి సరిగ్గా లేదు. మంగళవారం ఉదయం తండ్రి సంజయ్ తన కుమారుడు హృతిక్‌సింగ్‌తో కలిసి జేజేనగర్‌లో వాకింగ్ చేస్తుండగా.. అక్కడ చెత్తబండి ఎక్కి వెళ్లిపోయాడు. ఆచూకీ లభించకపోవడంతో నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం..పసిపాపకు ప్రాణసంకటం


ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

మేడిపల్లి: మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓ ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు నిర్లక్ష్యం కారణంగా పసిపాప చేతివేళ్లు తొలగించే పరిస్థితి వచ్చిందని ఆరోపిస్తూ.. పాప బంధువులు మంగళవారం ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. యాదాద్రి భువనగిరిజిల్లాకు చెందిన సుధాకర్‌నాయక్, అనిత దంపతులకు 25 రోజుల క్రితం పీర్జాదిగూడలోని శ్రీజ ఆసుపత్రిలో కవల పిల్లలు జన్మించారు. పిల్లల ఆరోగ్య పరీక్షల నిమిత్తం పీర్జాదిగూడలోని మిరాకిల్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యసేవల కోసం పిల్లలను ఐసీయూలో ఉంచి వైద్యం అందిస్తున్నారు. ఓ పాపకు సెలైన్ ఎక్కించే క్రమంలో చేతివేళ్లను హార్డ్‌కోర్ బ్యాండేజీతో కట్టు కట్టారు. ఈ క్రమంలో సిబ్బంది అజాగ్రత్త వల్ల చేతివేళ్లను 25 రోజుల పాటు అలాగే బ్యాండేజీతో కట్టి ఉంచడంతో రక్త ప్రసరణ లేక చేతివేళ్లు చచ్చుబడే స్థితికి చేరాయి. దీంతో సిబ్బంది తప్పును కప్పిపుచ్చేందుకు చేతివేళ్లకు ఇన్ఫెక్షన్ అయిందని, వాటిని ఆపరేషన్ చేసి తొలగించకపోతే చేతివేళ్లు ఊడిపోయే స్థితిలో ఉన్నాయని బంధువులకు ఆసుపత్రి సిబ్బంది చెప్పారు. దీంతో ఆగ్రహించిన కుటుంబసభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. సుమారు రూ.10 లక్షలు వైద్య ఖర్చుల నిమిత్తం ఆసుపత్రికి చెల్లించినా.. నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు ఆసుపత్రి యాజమాన్యంపై చట్టపరమైన చర్యలను తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి రఘునాథ్‌స్వామి ఆసుపత్రికి చేరుకుని విచారణ చేస్తున్నారు.

ఎమ్మెల్యే చేయూత



కాప్రా: చదువుకోవాలనే ఆసక్తి, లక్ష్యాన్ని చేరుకోవాలనే పట్టుదల ఉన్న పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తూ.. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తోడ్పాటును అందిస్తున్నారు. ఉన్నత చదువులకు ఆర్థిక స్థామత అడ్డొచ్చిన విద్యార్థులకు ఫీజులు చెల్లించలేని పేద విద్యార్థుల ఫీజులు తానే చెల్లిస్తూ పేద విద్యార్థుల లక్ష్యాలను నెరవేరుస్తున్నారు. దీనిలో భాగంగానే 'చదువు మీ వంతు–ఆర్థికభారం నావంతు, ర్యాంకు మీ వంతు–ఫీజు నావంతు' అంటూ పేద విద్యార్థులకు అండగా ఉంటున్నారు. మల్లాపూర్ డివిజన్‌కు చెందిన మచ్చ శ్రీనివాస్ కూతురు తన్మయి ఎల్బీనగర్‌లోని కామినేని అకాడమీ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. తండ్రి శ్రీనివాస్ నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో కుమార్తె ఫీజు చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఆమెకు తన బీఎల్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఫీజు చెల్లించేందుకు ముందుకొచ్చారు. మంగళవారం ఏఎస్ రావునగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో రూ. 60 వేల చెక్కును అందజేశారు. కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శంకరమంచి రఘుశర్మకు సన్మానం


శంకరమంచి రఘుశర్మను సత్కరిస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: అమెరికాలో శ్రీసాయి దత్తపీఠం వ్యవస్థాపకులు, శంకరమంచి రఘు శర్మ హిందూధర్మ రక్షణ కోసం కృషి చేస్తున్నారని శృంగేరి ఆస్థాన పౌరాణికుడు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి వెల్లడించారు. దర్శనం ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక సంపాదకులు మరుమాముల వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌కేపురంలోని వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో బ్రహ్మశ్రీ శంకరమంచి రఘుశర్మను సత్కరించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. శంకరమంచి రఘు శర్మ అమెరికాలో సనాతన ధర్మాన్ని పరివ్యాప్తం చేస్తూ, తెలుగు వారికి ఉపాధి, వసతి, ధార్మిక సేవ చేస్తూ గౌరవ ప్రతిష్టలు పొందుతున్నారన్నారు. వెంకట రమణ శర్మ మాట్లాడుతూ.. శంకరమంచి రఘు శర్మ అమెరికాలో శివ విష్ణు దేవాలయాల సముదాయాన్ని నిర్మించి అమెరికాలో హిందువులందరిని ఏకతాటిపై తెచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయశర్మ, అష్టలక్ష్మి దేవాలయం చైర్మన్ సోమా సురేష్, ఫౌండర్ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా, కార్యదర్శి జగన్, ప్రత్యంగిరా దేవాలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్, వేద పండితులు కాసుల చంద్రశేఖర్ శర్మ, కాసుల రాధాకృష్ణ శర్మ, కొడకండ్ల రాధాకృష్ణ శర్మ పాల్గొన్నారు.